
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 30 జూన్ 2024



వేములవాడ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి 8
అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి 8



రైతు భరోసాకు కసరత్తు

- రైతుల సలహాలు, అభిప్రాయాల సేకరణ
- వచ్చే నెల 4 వరకు సింగిల్ విండోల సమావేశాలు
- మరోవైపు సాగు భూముల లెక్కలు
- సాగులో లేని భూములకు రైతు భరోసా దూరం
- జిల్లాలో గతేడాది 1.29 లక్షల మంది రైతులకు రూ.260.20 కోట్ల రైతు బంధు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు భరోసా పేరుతో రైతు బంధు తరహాలో పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. రైతుబంధుపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగినా రైతు బంధు పథకం అర్హుల కంటే అనర్హులకే ఎక్కువగా ఉపయోగపడిందనే విమర్శలు వెల్లువెత్తాయి. బంజేరు భూములు, గుట్టలు, రాళ్లు, రప్పలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలకు, రైతు బంధు అందిచారనే ఆపపణలు, చర్చలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంలో మార్పులు తీసుకొచ్చి రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందించే దిశగా కసరత్తు మొదలు పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల ముందు రైతుల నుంచి ప్రతిపక్ష పార్టీల నుంచి ఒత్తిడి పెరగడంతో గత ప్రభుత్వం మాదిరిగానే రైతు బంధు సాయాన్ని అందించింది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మాత్రం రైతు భరోసా పథకాన్ని ముందుకు తీసుకొచ్చింది. ఇందులో ఉన్న లోపాలను సవరించడానికి రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 24 వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి అభిప్రాయాలను, సూచ నలు, సలహాలను సేకరించే దిశగా సమావేశాలను నిర్వహిస్తోంది. సహకార సంఘాల్లో ఉన్న రైతుల నుంచి ఏ మేరకు రైతు భరోసా ఇవ్వాలి? ఎన్ని ఎకరాలకు ఇవ్వాలి? సాగు చేసే భూములకు ఇవ్వాలా, అనే అంశాలపై సమావేశాలను శనివారం ప్రారంభించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు సమావేశాలు కొనసాగను న్నాయి. తొలి రోజు పెద్దూర్, ముస్తాబాద్, సిరిసిల్ల, నేరేళ్ల సహకార సంఘాల్లో సమావేశాలను జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు, వ్యవసాయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 30న మాన్వాడ, నర్సింగాపూర్, కొలనూర్, కోనరావుపేటలో సమావేశాలకు ఏర్పాటు చేశారు. జూలై 1న కోరెం, బోయినపల్లి, చందుర్తి, సనుగుల, 2న గాలిపెల్లి, ఇల్లంతకుంట, మానాల, రుద్రవరం, 3న గంభీరావుపేట, కొత్తపల్లి, అల్మాస్‌పూర్, ఎల్లారెడ్డిపేట, 4న వేములవాడ, పోత్గల్, నాంపల్లి, తిమ్మాపూర్ వ్యవ సాయ ప్రాథమిక సహకార సంఘాల్లో సమావేశాలు నిర్వహించ నున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధుపై ఎన్ని ప్రశంసలు వచ్చాయో? అన్ని ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత కోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలు స్తోంది. గత ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో ఎకరానికి రూ.5 వేలు పెట్టుబడి సాయం అందించగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7500 చొప్పున రెండు సీజన్లకు రూ.15 వేలు అందించనుంది. ఈ క్రమంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించిన అనంతరం జూలై 10వ తేదీ లోగానే రైతు భరోసాను అమల్లోకి తీసుకురానుంది. గత ప్రభుత్వం హయాంలో 11 విడతలుగా రైతు బంధు అందించగా గత సంవత్సరం లక్షా 29 వేల 407 మందికి రూ.260.20 కోట్లు అందించారు. ఈ సారి రైతు భరోసాపై అన్నదాతాల్లో ఆసక్తి ఏర్పడింది.

వానాకాలం సాగు 2.42 లక్షల ఎకరాలు

జిల్లాలో వానాకాలం సాగులో రైతులు నిమగ్నమయ్యారు. జిల్లాలో 2 లక్షల 42వేల 766 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి 1.83 లక్షలు, పత్తి 49215 ఎకరాలు, మొక్కజొన్న 1510, కందులు 1502, పెసర 348, ఉద్యాన పంటలు 6900, ఇతర పంటలు 598 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వర్షాలు ఇప్పటికి సమృద్ధిగా పడకపోవడంతో వరి నాట్లు ఊపందుకోలేదు. వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 50 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు వేసుకున్నారు. వర్షాలు లేకపోవడంతో పత్తి మొలకదశలోనే ఎదుగుదల లేని పరిస్థితి ఏర్పడింది. రైతులు వరి నాట్ల కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు రుణ ప్రణాళిక లేక బ్యాంకుల నుంచి రుణాల మొదలు కాలేదు. వడ్డీ వ్యాపారుల నుంచి రైతులు అప్పులు తెచ్చుకొని సాగు పనులు చేస్తున్నారు. రైతు భరోసా సాయం కోసం ఎదురు చూస్తున్నారు.



పెద్దూర్‌లో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

రైతుల అభీష్టం మేరకే రైతు భరోసా

సిరిసిల్ల రూరల్, జూన్ 29: రైతుల అభీష్టం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించనుందని, ఇందుకోసం రైతుల అభిప్రాయాలను సేకరిస్తోందని జిల్లా సహకార అధికారి బుద్ధ నాయుడు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో శనివారం చైర్మన్ జీల కిషన్ యాదవ్ అధ్యక్షతన అభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా పలువురు రైతులు ఐదెకరాల వరకే రైతు భరోసాను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బుద్ధనాయుడు మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్తామన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ నారాయణ గౌడ్, ఏవో సందీప్‌కుమార్, కౌన్సిలర్లు సత్యనారాయణ, కీర్తి కమలాకర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావ పాల్గొన్నారు.

సూచనలు అందించండి

తంగళ్లపల్లి, జూన్ 29: రైతు భరోసాపై రైతులు సూచనలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. శనివారం రైతు భరోసా పథకంపై సిరిసిల్ల, నేరెళ్ల ప్రాథమిక సహకార సంఘాల్లో అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఇచ్చే సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్యాక్స్ చైర్మన్‌లు బండి దేవాస్, కోడూరు భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురా వాలన్నారు. జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణ జ్యోతి, వినోద్ కుమార్, ప్యాక్స్ వైస్ చైర్మన్లు ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, బొంగరం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ముస్తాబాద్, జూన్ 29 : తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ అన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నో బ్యాగ్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్, సైబర్ సేఫ్టీ, త్రీ మినిట్స్ టు టీచర్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పదో తరగతి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శైలజ, ప్రధానోపాధ్యాయులు మద్దికుంట లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

బోయినపల్లి, జూన్ 29:ప్రభుత్వ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు సూచించారు. బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ ఆస్పత్రి తనిఖీ చేసిన సమయంలో గైర్హాజరైన వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, అటెండ్‌‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

పేదలకు ఉచిత వైద్యం అందించాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 29 : వైద్యులు పేదలకు ఉచిత వైద్య సేవలను అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలని లక్ష్మీనరసింహ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని వార్డుల్లోనూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఆస్పత్రి వైద్యులు అరవింద్, సురేంద్రబాబు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సిరిసిల్ల క్రైం, జూన్ 29: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా వ్యాప్తం గా విస్తృత తనిఖీలు నిర్వహించిన సందర్భంగా శనివారం వివరాలు వెల్లడించారు. 20రోజుల స్పెషల్ డ్రైవ్‌లో 2068 కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో మైనర్ డ్రైవింగ్ కేసులు 414, లైసెన్స్ లేకుండా నడిపిన వారిపై 831, సెల్ ఫోన్ డ్రైవింగ్ 163, మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై 334, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 326 కేసులు నమోదు చేశామన్నారు. నంబరు ప్లేట్స్ లేని వాహనాలను 558 గుర్తించామని, వాటికి నంబరు ప్లేట్స్ బిగిం చామని అన్నారు. వాహనాలు తనిఖీలు చేసి కేసులు నమోదు చేయడం తమ ప్రధాన ఉద్దేశం కాదన్నారు. కారణం లేకుండా మరణం ఒక రోడ్డు ప్రమాదమేనని, ప్రతీ ఒక్కరు క్షేమంగా గమ్యస్థానాలు చేరుకోవాలనే ఉద్దేశంతో తనిఖీలు చేపట్టామని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాల న్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దన్నారు. నిబంధ నలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, మద్యం మత్తులో వాహనాలు నడుపరాదన్నారు.

పథకాలు అట్టడుగువర్గాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

ఇల్లంతకుంట, జూన్ 29: సంక్షేమ పథకాలు అట్టడుగువర్గాల ప్రజలకు చేరాల న్నదే ప్రభుత్వ లక్ష్యం అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ అన్నారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అధ్యక్షతన శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మితిమీరన అప్పులు చేసి రాష్ట్రాన్ని ఊబిలోకి నెట్టిందన్నారు. నిధుల కొరతతోనే కొన్ని పనులు ఆలస్యమవుతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికా బద్ధంగా ముందుకు పోతున్నారన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర ఉన్నతమైందన్నారు. మండలాన్ని అన్నిరంగాలలో ముందుకు తీసుకపోతానన్నారు. ఎంపీపీ రమణారెడ్డి పట్టుదల కలిగిన వ్యక్తి అన్నారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ప్యాక్స్‌చైర్మన్లు తిరుపతిరెడ్డి, అనంతరెడ్డి, తహసీల్దార్ జావెదఅహమ్మద్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీటీసీలు పర్శరాం, తిరుపతి, ముత్యంరెడ్డి, పుష్పలత, సుమలత, స్రవంతి, కోఆప్షన్ సభ్యుడు సలీం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

మండలంలోని వివిధ గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే సత్యనారా యణ హాజరయ్యారు. వల్లంపట్ల గ్రామంలో సీసీరోడ్డు, గౌడసంఘం భవనం, ఇల్లంత కుంట ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్, డ్రైనేజీ, క్రీడాప్రాంగణం, రెడ్డి సంఘభవ నం, మండలపరిషత్ సమావేశ మందిరాలను ప్రారంభించారు. మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో పదవీవిరమణ సమావేశం నిర్వహించారు. పలు గ్రామాల నాయకులు ఎంపీపీని సన్మానించారు.

రాజన్న కోడెల మృత్యువాత



గోశాలలో మృత్యువాత పడిన కోడెలు

వేములవాడ కల్చరల్, జూన్ 29: వేములవాడలో రాజ రాజేశ్వరస్వామి ఆలయా నికి చెందిన ఐదు కోడెలు శనివారం మృతి చెందాయి. ఆలయానికి వచ్చే భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు రాజన్నకు నిజ కోడెను చెల్లించడం ఆన వాయితీగా వస్తోంది. రాజన్న ఆలయం తిప్పాపూర్ గోశాలలో సుమారుగా 1,500 కోడెలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కొరవడడంతో నిత్యం కోడెలు అనారోగ్యం బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. శనివారం ఉదయం ఐదు కోడెలు మృత్యువాత పడ్డాయి. విషయం బయటకు పొక్కకుండా అధికారులు, సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా మహాలక్ష్మి వీధిలోని సజలధార బావి సమీపంలోని మూలవాగులో ఖననం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని, రాజన్న ఆలయ కోడెల ఆరోగ్య పరిస్థితిపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని పట్టణవాసులు, భక్తులు కోరుతున్నారు.

కోడెల మృత్యువాతపై బీజేపీ నాయకుల ఆగ్రహం



రాజన్న ఆలయ ఈవో కార్యాలయం ఎరుట బైఠాయించిన బీజేపీ నాయకులు

వేములవాడ కల్చరల్, జూన్ 29: భక్తులు రాజన్నకు సమ ర్పించే కోడెలు అకారణంగా మృతువాత పడుతున్నా అధికా రులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఈవో హరికిషన్‌కు విన తి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్య క్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు విలేకరులతో మాట్లాడారు. కోడెల మృత్యు వాతలో రాష్ట్ర దేవదాయశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపి స్తోందని ఆరోపించారు. దక్షణకాశీగా పేరుగాంచిన రాజ న్న క్షేత్రానికి పూర్తిస్థాయి కార్యనిర్వహణ అధికారిని నియమిం చకపోవడంతో పర్యవేక్షణలో లోపం జరుగుతోందన్నారు. బీజేపీ ధర్నా విషయం తెలుసుకొని తెల్లపేపరు మీద అధికారుల సంతకం, దేవాలయ స్టాంపు లేకుండా రూ.1.11 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలపడం అనుమానాలకు తావిస్తోంద న్నారు. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని రంగు రంగుల బ్రౌచర్‌లపై చూపించి మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అదేవిధంగా చేస్తున్నట్లు అనిపిస్తోందని అన్నారు.మృతి చెందిన గోవులను శాస్త్రీయ పద్ధతిన ఖననం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అనిల్, మనోజ్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజ్ కుమార్, శేఖర్, లక్ష్మిరాజం, మారుతి, మల్లేశం ఉన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 29: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను రానున్న 10 రోజులలో పరిష్కరించాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌నవీన్ మిట్టల్ ఆదేశిం చారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యా లయం నుంచి పెండింగ్ ధరణి సమస్యల పరి ష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. జూన్15 నుంచి జూన్28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల ఆన్ లైన్‌లో అప్ డేట్ చేసి పరిష్కరించాలన్నారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో కొంత నెమ్మదించిన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పెండింగ్ దరఖాస్తులను 10 రోజుల వ్యవధిలో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో దరఖాస్తుల క్షేత్రస్థాయి విచారణ, రికార్డుల పరిశీలన పూర్తవుతున్న నేపథ్యంలో సంబంధిత దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో అప్ డేట్ చేస్తూ డిస్పోస్ చేయాలన్నారు. ఆర్ఎస్ఆర్ లిమిట్, మిస్సింగ్ సర్వే నంబర్లు, సక్సెషన్, మ్యూటేషన్, మొదలగు వివిధ సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యా సంస్థ ఏర్పాటుకు అనుకూలంగా 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలన్నారు. ఆధార్ బయోమెట్రిక్ వేలి ముద్ర స్వీకరణ సంబంధించి ఎల్-1 పరికరాల వినియోగ గడువు ముగుస్తున్న నేపథ్యంలో జిల్లాలకు ఎల్ టీ బయోమెట్రిక్ పరికరాలు పంపడం జరిగిందని, వీటిని సరిగ్గా రీప్లేస్ చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 29 : ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి వేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో వేములవాడ అర్బన్, రూరల్ మండలాల అర్హులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వరసగా వచ్చిన ఎన్నికల నేపథ్యంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఆలస్యమైందన్నారు. ప్రభుత్వ సామాజిక బాధ్యతగా నిరుపేద ఆడబిడ్డలకు వివాహ కానుకగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి దేశం రాష్ట్రం వైపు చూసేలా చేసిందని గుర్తు చేశారు. గృహజ్యోతి పథకం ద్వారా ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా ఇళ్లు లేని వారికి త్వరలోనే వాటి నిర్మాణానికి బీసీలకు రూ.5 లక్షలు, ఇతరులకు రూ.6 లక్షలు కాంగ్రెస్ ప్రభుత్వం అందించేందుకు సిద్ధమైందని సూచించారు. వేములవాడ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఒక వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమం కొనసాగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో శనివారం 127 మంది లబ్ధిదా రులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనరావుపేట మండలాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. నిరుపేద ప్రజలకు చేయూత అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు బాగుంటే వాటిని కూడా అమలు చేస్తామన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ పాలనలో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను కొనసాగిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. తాను మండల ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడే కోనరావుపేట మండలానికి జూనియర్ కళాశాలను వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశానన్నారు. కోనరావుపేట మండలంలో బ్రిడ్జిలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సెస్ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, ఫిరోజ్ పాషా, రమేష్ రెడ్డి, మానుక సత్యం, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, వంగపెల్లి సుమలత, నందు గౌడ్, లింబయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బావుసాయిపేట గ్రామంలో లారీ డ్రైవర్ రాజేష్ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, సంకినేని రామ్మోహన్‌రావు, ఎరపీటీసీ చారి, డిప్యూటీ తహసీల్దార్ జయంత్ తదితరులు ఉన్నారు.







అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు, వేదపండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయంలో పలు శాఖల అధికారులతో పాటు నాయకులు పవన్‌తో సెల్ఫీలు దిగారు. - మల్యాల





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్



జనసేనానికి తలపాగా చుడుతున్న అర్చకుడు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 29: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. జేష్ఠ బహుళ అష్టమి తోడు కావడంతో లక్ష్మీనరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆ లయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటు కున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశా రు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మం త్రోచ్చారణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు ని ర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీని యర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు సింగారం గుట్టపై అస్థిపంజరం

- రెండు నెలల క్రితం చనిపోయినట్లు నిర్ధారణ

- మగ వ్యక్తి మృతదేహంగా గుర్తింపు

పెద్దపల్లి రూరల్, జూన్ 29: మండలంలోని సబ్బితం గ్రామ



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, వైద్యులు

పంచాయితి పరిధి గట్టుసింగారం గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. గ్రామానికి చెందిన మేకల కాపరులు మేకలను గట్టుసింగారం గుట్టపైకి మేపడానికి తీసుకెళ్లడంతో గుట్టపైన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి అస్థిపంజరం కనిపించింది. దీంతో సబ్బితం గ్రామపంచాయతీ కార్యదర్శికి రవికి సమాచారం అందించగా కార్యదర్శి బసంత్ నగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదు చేశారు. దీంతో బసంత్ నగర్ ఎస్ఐ ఆర్.స్వామి, వైద్యులు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పరిశీలించిన వైద్యులు సుమారు 25 నుండి 40 ఏళ్ల వయసు గల మగ వ్యక్తి ఆస్థిపంజరం అని , అతను చనిపోయి సుమారు రెండు నెలలు సమయం అయిందని పేర్కొన్నారు. సంఘటనపై అక్కడే పంచానామ నిర్వహించి , కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంసంత్‌నగర్ ఎస్ఐ ఆర్. స్వామి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, జూన్ 29: తంగళ్లపల్లి మండ లం పద్మనగర్ గ్రామానికి చెందిన కొట్టాల గోవర్ధన్‌రెడ్డి (29) అనే యువకుడు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కొట్టాల లచ్చిరెడ్డి, ప్రమీల దంపతుల రెండో కుమారుడు కొట్టాల గోవర్ధన్‌రెడ్డి శుక్ర వారం రాత్రి రెండో అంతస్తులో ఉన్న బెడ్ రూమ్‌లో నిద్రించడానికి వెళ్లాడు. శనివారం ఉదయం 11 గంటలైనా నిద్రలేవకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా బెడ్ పైనుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గోవర్ధన్ (ఫైల్)

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 29: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 28 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరో వ్యక్తికి ఏడు రోజులు, నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 13,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 36 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

10న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జూలై 29: టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో 8వ విడత జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను జూలై 10న ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని తెలిపారు.

నవ్య కుటుంబ కదంబం
ఆదివారం



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరఫున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడి విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లబించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.

ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బొకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్ల వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.



మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?


నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!




సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఇదో కెరీర్ అని ఒప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్(2010)'లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.



నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్ఫయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'ఆజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నస్రుత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయ్యే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యూమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది.. తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

మత్స్యకారులకు చిక్కిన 20 కిలోల చేప



కోనరావుపేట, జూన్ 29 : కోనరావుపేట మండలం కొలనూరు చెరువులో మత్స్యకారులకు శనివారం 20 కిలోల చేప చిక్కింది. శనివారం కొలనూరు గ్రామ శివారులోని చెరువులో మత్స్య కారులు వలలు వేసి చేపలు పట్టారు. ఈ క్రమంలో 20 కిలోల భారీ చేప మత్స్యకారులకు చిక్కింది. మత్స్యకారులకు చేప దొరక డంతో గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట, జూన్ 29 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. అర్హులు జూలై 3న బుధవారం సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియ 4న డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

సీసీ రోడ్డు పూర్తి చేయాలని కౌన్సిలర్ వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్, కాలనీవాసులు

సిరిసిల్ల టౌన్, జూన్ 29 : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ నేరెళ్ల శైలుశ్రీకాంత్‌గౌడ్, స్థానిక ప్రజలతో కలసి శనివారం శాంతినగర్ రోడ్డుపై బైఠాయించారు. భజన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శైలుశ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ గత సంవత్సరం వార్డుల అభివృద్ధిలో భాగంగా శాంతినగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభించారన్నారు. పూర్తిగా వేయలేదని, మురికికాలువపై నుంచి కల్వర్టు కట్టక పోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసంతృప్తిగా ఉన్న సీసీ రోడ్డుతోపాటు మురికికాలువపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కాలనీవాసులు మచ్చ లచ్చయ్య, వేముల లక్మన్, మహమ్మద్ షబీర్, అనిత, అక్షర, లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి నగదు పురస్కారం

ఇల్లంతకుంట, జూన్ 29: మండలంలోని దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని గౌరవేని మాన్యతకు వాసంతిదేవి చారిటబుల్ ట్రస్ట్, వెంకట రామారావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా రూ.50వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. పాఠశాల ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన గజ్జల వర్షిణి, గొడుగు శ్రీవాణి, గౌరవేణి భవ్యకు రూ .13వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వాడె శ్వేతకు రూ.11వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కమిటీ సభ్యులు దామెర రవీందర్‌రావు, భరత్, శరత్, జోగినిపల్లి శ్రావణ్, సురభి కమలాకర్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఎంపీటీసీ తిరుపతి, ముత్యాలు, సంజీవరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ఇల్లంతకుంట, జూన్ 29: మండలంలోని దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన ఈదులకంటి శ్రీనివాస్ శనివారం కంప్యూటర్లను వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఎంపీటీసీ బర్ల తిరుపతి, ముత్యాలు, వాడె సంజీవరెడ్డి, మారవేని రమేష్, నరేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, జూన్ 29 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభ కరపత్రాన్ని శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో దొడ్డి కొమరయ్య వర్ధంతి సన్నాహక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాడు నైజాం సర్కార్, జమీందార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం విముక్తికోసం జరిగిన పోరాటంలో జనగాం జిల్లాకు చెందిన దొడ్డి కొమరయ్య ఎదురొడ్డి పోరాడి అమరుడయ్యారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ జూలై 4న సిరిసిల్ల పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ చైర్మన్ జగ్గాని మల్లేశంయాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సీపీఐ నాయకుడు సోమ నాగరాజు, కమిటీ సభ్యులు వాసం మల్లేశం, బొజ్జ కనకయ్య, బుర్ర మల్లేశంగౌడ్, అంబటి చందు, మోహన్ పాల్గొన్నారు.

వేములవాడ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి



ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- రూ.101కి అంతిమ సంస్కారం - కౌన్సిల్ ఆమోదం

వేములవాడ టౌన్, జూన్ 29 : వేములవాడ పట్టణ, ఆలయ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆయ గుడి చెరువులో, మూలవాగులో కలుస్తున్న మురుగు నీరును మళ్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయన్నారు. మూలవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు, మినీస్టేడియం నిర్మాణ పనులు, పట్టణంలో రూ.20 కోట్లతో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇళ్లు లేని వారికి త్వరలోనే కార్యక్రమాన్ని ప్రారంభించి అందించేందుకు కృషిచేస్తామని హామీచ్చారు. మహాలక్ష్మి వీధి నుంచి కస్తూర్బా పాఠశాల వరకు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు నిలిచిపోయాయని, తిరిగి ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలపై చర్చించారు. 3వ వార్డు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో కొంత ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విప్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనుమతులు ఇవ్వలేదని అధికారులు సమాధానం ఇచ్చారు. అన్యాక్రాంతమైనట్లు తమ దృష్టికి వచ్చిందని త్వరలోనే వెలికి తీస్తానని చెప్పారు. మరో కౌన్సిలర్ గోలి మహేష్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో రూ.3 కోట్లతో శ్యామకుంట వెజిటేబుల్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావడం లేదని, వార్డుల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లకు విద్యుత్ బిల్లులు మినహాయింపు ఇవ్వాలని కోరారు. శ్యామకుంట వెజిటెబుల్ మార్కెట్‌లో ఆసక్తి గల వారిని పిలిపించి అందులో అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులకు సూచించారు. 4వ వార్డు కౌన్సిలర్ మారం కుమార్ మాట్లాడుతూ మొదటి బైపాస్ రెడ్డు నుంచి కస్తూర్బా పాఠశాల వరకు బీటీ రోడ్డు వేయాలని, రైల్వే లైన్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీ బస్టాండు నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని, రిజిస్ట్రేషన్ దరలు తగ్గిస్తూ త్వరితగతిన రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువెళ్లారు. మొదటి బైపాస్ రోడ్డు నుంచి కస్తూర్బా పాఠశాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, రైల్వే లైన్ బాధితులు, ఆర్టీసీ బస్టాండు నిర్మాణం, రిజిస్ట్రేషన్‌లపై ఎమ్మెల్యే ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదని తెలిపారు. తిప్పాపూర్ కౌన్సిలర్ కందుల శ్రీలత బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం రూ.101కే వేములవాడ మూలవాగులోని వైకుంఠధామంలో అంతిమ సంస్కారాలు నిర్వహించాలని కౌన్సిలర్లు అందరు కోరడంతో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ అన్వేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ మేనేజర్ సంపత్‌రెడ్డి కౌన్సిలర్లు సంఘ హన్మావ్వ, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జడల లక్ష్మి, నీలం కళ్యాణి, కందుల శ్రీలత, జోగిని శంకర్, సిరిగిరి రామచంద్రం, గడ్డమీది లావణ్య, తిరుమల్‌రెడ్డి కవిత, కుమ్మరి శిరీష, సంతోష్‌బాబు, ఇప్పపూల అజయ్, శేఖర్, మహేష్ అధికారులు తదితరులు ఉన్నారు.

ఘనంగా బొజ్జ తారకం జయంతి

సిరిసిల్ల టౌన్, జూన్ 29 : సిరిసిల్ల పట్టణ అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం దళిత ఉద్యమ నాయకుడు, న్యాయవాది బొజ్జ తారకం 85వ జయంతిని నిర్వహించారు. బొజ్జ తారకం చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జ తారకం దాదాపు నాలుగు దశాబ్దాల కాలం మానవ హక్కులు, దళిత, వామపక్ష, ప్రజాన్యాయ పోరాటాలను సాగించారన్నారు. చుండూరు, కారంచేడు, వేంపేట, లక్ష్మీపేట బాధితులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

వేములవాడ టౌన్, జూన్ 29: వేములవాడ విలీన గ్రామాలతోపాటు మండలంలోని అయా గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. గుండె శస్త్రచికిత్స చేయించుకొని తిరిగి వచ్చిన సందర్భంగా శనివారం ఆయనను నాంపల్లి గ్రామ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా భారతీయ జనత పార్టీ హవా కొనసాగుతోందన్నారు.రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు అన్ని గ్రామాల్లో ఇప్పటి నుంచే పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అమలు కాని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో మేర్గు లక్ష్మణ్, గొళ్లం గంగరాజు, బోయిని సంపత్, లాల శేఖర్, పర్శరాములు ఉన్నారు.

సేవలతో గుర్తింపు

చందుర్తి, జూన్ 29 : ఉద్యోగికి విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ భానుమూర్తి అన్నారు. చందుర్తి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కడావత్ దయాల్ పదవీ విరమణ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అంకిత భావంతో పని చేయాలన్నారు. జగిత్యాల రీజినల్ మేనేజర్ రాజనరేంద్ర, కిరణ్ కుమార్, నాయకులు పులి సత్యం, ఎడ్ల కిషన్, బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

వీర్నపల్లి, జూన్ 29 : పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో అయా శాఖల అధికారులతో కలిసి శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని, ఎవరైనా ఇతర కులాల పట్ల చిన్నచూపు చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శనివారం కోనరావుపేట ఎస్సై అంజనేయులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో అంటరాని తనాన్ని పాటిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరునికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవడానికి యువత కృషి చేయాలని అన్నారు. ప్రతీ ఒక్కరు తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సంహపంక్తి భోజనం చేశారు.

చందుర్తి: అంటరానితనాన్ని నిర్మూలించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం సనుగులలో శనివారం హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంటారనితనం నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు. పీఆర్ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, అంబేద్కర్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితం

సిరిసిల్ల టౌన్, జూన్ 29 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ ప్రజాసేవకు అంకింతమయ్యారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్ మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. సీనియర్ నాయకుడిగా కాంగ్రెస్ పార్టీకి డీఎస్ ఎంతో సేవ చేశారని, డీఎస్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య ప్రగాఢ సంతాపం తెలిపారు.

అంకితభావంతో పని చేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్ జూన్ 29: ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ ఈఈ శ్యాంసుందర్, కలెక్టరేట్ నైట్ వాచ్‌మెన్ నారాయణ పదవీ విరమణ సందర్భంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న అధికారులు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, డీఎస్‌వో బుద్ధనాయుడు, డీఏవో భాస్కర్, పంచాయతీ రాజ్ ఈఈ సూర్యప్రకాష్, అర్‌అండ్‌బీ డీఈ నాగరాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జూన్ 29: మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన 50 మంది మహిళలు మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకుల లత ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని సర్కారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోందన్నారు. రూ.2500 పింఛను మంజూరు చేయనుందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించడానికి పెద్ద పీట వేస్తోందన్నారు. రైతు రుణ మాఫీ ఆగస్టు 15లోగా రైతులందరికీ వర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సర్కారు పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, రాజేశం, రాంరెడ్డి, సుధాకర్, రాజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

సిరిసిల్ల రూరల్, జూన్ 29:సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం స్ఫూర్తి ఫౌండేషన్ అధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించడానికి తమ సంస్థ నోట్ బుక్స్ ఉచితంగా అందిస్తోందన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాకావత్ మోతీలాల్, ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంజనేయులు, శ్రీపతి కాశీరాం, పోన్నం నవీన్, గుండెల్లి గోవర్ధన్, సిరిగిరి మల్లేశం, దుబాల సతీష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ఉపాధ్యాయులు శంకర్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాఫ్ కార్యదర్శిగా కుమ్మరి మల్లేశంను శనివారం ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఉన్న స్టాఫ్ కార్యదర్శి మల్లారపు పురుషోత్తం ఉద్యోగ పదవి విరమణ చేయడంతో పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కుమ్మరి మల్లేశం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కుమ్మరి మల్లేశంను ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. ప్రధానోపాధ్యాయుల లాకావత్ మోతీలాల్, ఉపాధ్యాయులు దాసరి రవీందర్, పాతూరి మహేందర్‌రెడ్డి, బొమ్మవరం గోవిందరావు, పాకాల శంకర్‌గౌడ్, దేవత ప్రభాకర్, హుజునాయక్, శ్రీహరి, ఫాతిమా, సంధ్యారాణి, సరిత, మంజుల, సాంబయ్య, సమ్మయ్య, నసీరుద్దీన్, లక్ష్మీనారాయణ, రాములు పాల్గొన్నారు.

సేవాభావంతో పని చేయాలి

వీర్నపల్లి, జూన్ 29 : విధి నిర్వహణలో ఉద్యోగులు సేవాభావంతో పని చేయాలని, వృత్తిలో ఉన్నంతవరకు చేసిన సేవలు ప్రజలకు చిరకాలం గుర్తుంటాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వీర్నపల్లి మండలం పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఏఎస్సై రాజిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి దంపతులకు ఎస్పీ మెమోంటో అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



సర్వే చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వీర్నపల్లి, జూన్ 29 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి నిరుద్యోగ యువజన సర్వే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగాలు భర్తీ చేసేంతవరకు నిరుద్యోగ యువతకు రూ.4వేల నిరుద్యోగ భృతిని ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వాలు మోసం చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. నీట్ పేపర్ లీకేజీ కావడంతో విద్యార్థులందరూ భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ స్కాంపై మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువత సమస్యలపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్, కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, నాయకులు రాకేష్, నరేందర్, క్రాంతి, మనోజ్, రమేష్, చంద్ర, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రచయితల సంఘం కన్వీనర్‌గా నర్సన్

వేములవాడ కల్చరల్, జూన్ 28 : వేములవాడ రచయితల సంఘం కన్వీనర్‌గా గూడూరి నర్సన్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రవి తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన రచయిత సంఘం సమావేశంలో మండల రచయితల సంఘం నూతన కమిటీని శనివారం ఎనుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్‌గా గూడూరి నర్సన్‌ను, కో కన్వీనర్‌గా మారపాక కృష్ణను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు బూర దేవానందం, కిరణ్‌కుమార్, సబ్బాని లక్ష్మీనారాయణ, అంకారపు రవి, ఊరూరి బాలరాజు, వంశీకృష్ణ, గణేష్, అమరేందర్ రెడ్డి, లోకిలి మౌనిక, గూడూరి దశరథము, రాజేందర్‌లు ఉన్నారు.

డీఎస్ మృతికి సంతాపం

వేములవాడ టౌన్, జూన్ 29 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి. శ్రీనివాస్ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. డీఎస్ లేని లోటు తీర్చలేనిదని తన దిగ్భ్రాంతిని వ్యక్త పరిచారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కోనరావుపేట, జూన్ 29 : కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ గ్రామానికి చెందిన అంగూరి దేవయ్య ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలోని వివాదాస్పద భూమిపై విచారణ చేపట్టామన్నారు. ఆయన వెంట కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు ఉన్నారు. అనంతరం కోనరావుపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చందుర్తి, జూన్ 29 : చందుర్తి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్ శనివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతన ఉంటుందన్నారు. సమావేశానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 29: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పర్శరాములు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వద్దకు వెళ్లి కళాశాలలో చేరాలని కోరారు. సర్కారు కళాశాలలో నాణ్యమైన విద్య అందుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 29: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, అల్మాస్ పూర్ గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ పృథ్వీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజన్నపేట గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.


ఒకరి రిమాండ్

రుద్రంగి, జూన్ 29: గంజాయి సరాఫరా చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇల్లంతకుంట మండలానికి చెందిన దమ్మని నవీన్ రుద్రంగి మండల కేంద్రం శివారులో గంజాయి సరఫరా చేస్తున్నాడన్నా సమాచారం మేరకు ఎస్సై అశోక్ పట్టుకున్నారు. నవీన్ వద్ద 250 గ్రాముల గంజాయి సీజ్ చేశామని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

జగిత్యాలరూరల్, జూన్ 29: కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ శ్రీచైతన్య రెసిడెన్షియల్ హైస్కూల్‌లో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హాస్టల్‌లోని ఆహారపదార్థాలను పరిశీలించారు. కాలంచెల్లిన ఆహారపదార్థాలతో పాటు, నాసిరకం పాలప్యాకెట్, కిరాణావస్తువులు, పురుగులతో నిండిన బియ్యాన్ని గుర్తించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తెలిపారు. కాలంచెల్లిన, కుళ్లిన ఆహార పదార్థాలు, నాణ్యతలేని, పురుగులు పట్టిన బియ్యాన్ని గుర్తించామన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 29: జిల్లాలో అవినీతికి పాల్పడుతున్న విద్యాశాఖ అధికారులపై చర్యలుతీసుకోవాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ అక్కెంనాగరాజు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయాన్ని శనివారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. జిల్లాలో చెట్లకింద చదువుకుంటున్న విద్యార్థులకు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతు న్నారని, స్వీపర్లు లేకపోవడంతో పాఠశాలలను ఉపాధ్యాయులు శుభ్రం చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఇంతవరకు స్కూల్ యూనిఫాం అందించలేదన్నారు. హాస్టల్స్‌లో నాణ్యత లేని ఆహారం కనీస వసతులు లేకుండా అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. వెంటనే అసమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో కొన్ని పాఠశాలల్లో కొన్ని సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు లేరన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అధిక ధరలకు బుక్స్ విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులకు కనపించడంలేదా? అని ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. స్పందించిన ఎస్సై శ్రీనివాసరావు తన స్సిందితో పాటు అక్కడికి చేరుకొని ఏబీవీపీ నాయకులతో మాట్లాడి ధర్నాను విరమించాలని కోరారు. పట్టించుకోక పోవడంతో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అక్కడికి చేరుకొని సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు. ఏబీవీపీ లాఫో రమ్ విభాగ్ కన్వీనర్ లోపెల్లి రాజు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోండ్ల తిరుపతి, సోషల్ మీడియా కో-కన్వీనర్ పెండ్యాల శివ, వికాస్, పనికిషోర్, కొప్పుల నవీన్, ఎనగందుల శ్రీనివాస్, బూర వెంకటేష్, కార్తీక్, అమర్నాథ్, ధనుష్, మనోజ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గాయకుడు సాయి చంద్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 29 : సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ వేద సాయిచందర్ ప్రథమ వర్ధంతి సంస్మరణ సభ నిర్వహించారు. సాయిచందర్ చిత్రపటం వద్ద కొండూరు రవీందర్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ సాయిచందర్ పాటలతో ప్రజల మనస్సును దోచుకున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో సాయిచందర్ తన ఆటాపాటతో ఉత్తేజ పరిచారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మహిళా పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనిత, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు బుర్ర రాజు, అడగట్ల మురళి, రాజ్‌కుమార్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, కంచర్ల రవిగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మలి దశ ఉద్యమంలో సాయిచంద్ పాత్ర మరవలేనిదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ మధు, నాయకులు సుభాష్, రమేశ్, పర్శరాములు, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రావు, సీత్యానాయక్, దేవరాజు, సందీప్, శరవింద్ తదితరులు పాల్గొన్నారు.